# యూదులు యేసును నిరాకరించినది ఎందులకు

"ఆయనను సిలువవేయుము!"; "వాని రక్తము మా మీదను మా పిల్లలమీదను ఉండునుగాక!" అనిరి (మత్తయి 27:22బి, 25బి). తన స్వజనులు యేసును నిరాకరించిన దానికి సాటియైనది మానవ చరిత్రలో ఏదీ లేదు. ఈలాటి మహా విపత్తును మనం ఎలా వివరించగలం? యూదులు తమ మెస్సీయా కొరకు కనిపెట్టుతున్నారు, ఆయన వచ్చి నప్పుడు వారెందుకు నిరాకరించారు?

### ఆయన వారిని నిరాశపరచాడు

యూదులకు యేసు నిరాశయై ఉన్నాడు. తాను అవతరించక పూర్వమే మెస్సీయాను గూర్చి తమ మనస్సులను సిద్ధపరచుకొనియున్నారు. వారు ఒక ప్రణాళికను సిద్ధపరచుకుని ఎదురు చూసారు. వారు సిద్ధపరచుకొన్న నమూనాలో ఆయన ఇమడనందున వారు బహుగా నిరాశ చెందారు. దావీదు సింహాసనంమీద కూర్చుండే రాజు వస్తాడని వారు పాత నిబంధన ప్రవచనాలలో చదివారు. మరియు వారు దానికి అక్షరార్థమైన రూపాన్ని యిచ్చారు. వారు భౌతికమైన రాజుకొరకు కనిపెట్టుతున్నారు. వారు ఆయనను బలవంతముగా రాజును చేయచూచారు (యోహాను 6:15), ఒకసారి ఆయన "తన్ను తాను దాచుకున్నాడు" (యోహాను 8:59). రాజ్యమును గూర్చిన అపార్థం తన శిష్యులకు కూడా వ్యాపించింది. రాజ్యములో ఎవడు అధికుడైయుంటాడో అనే విషయముపై వారు నిరంతరం వివాదం చేసికొంటూనే ఉండేవారు. ప్రభువైన యేసు మరణానంతరం, "ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించియుంటిమి" అని ఆయన శిష్యులు విలపించారు (లూకా 24:21). ఆయన పునరుత్థానం తరువాత కూడా ఆ రాజ్యము యొక్క స్వభావాన్ని శిష్యులు గ్రహించనట్టు అపొ. 1లోని వారి సంభాషణ బయలుపరచుతోంది.

తన రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు అని యేసు చెప్పినప్పుడు యూదులు నిరాశపడిపోయారు. ఆయన కైసరునకు శత్రువుకానని స్పష్టంగా తెలియజేశాడు కాని, వారికి అలాటి రాజ్యమే కావాలి. వారు విచారణకు ముందే తీర్మానించుకున్నారు; అకారణంగానే ద్వేష బుద్ధిని కనుపరచారు. అకారణ ద్వేష బుద్ధియే యింకా అనేకులు ఆయనను అంగీకరించకుండ చేస్తుంది. ఆయన మాటలను అన్వేషించక మునుపే వారు

తమ మనస్సులను సిద్ధంచేసికొన్నారు. వారు ఎదురు చూచిన వాటిని ఆయన జరిగించ నట్టయితే, ఆయననుండి వారు తొలిగిపోతారు.

## వారి భౌతిక వాదాన్ని ఆయన ఖండించాడు

భౌతిక సంబంధమైన ఆలోచనను మరియు జీవితాన్ని యేసు ఖండించాడు, వారి జీవిత వైఖరి మీద ఈలాటి ఎదుర్కోలును జనులు ప్రతిఘటించారు. యేసు గలిలయ సముద్రాన్ని దాటి గెరాసేనుల దేశానికి వెళ్లినట్టు చదువుతాం (లూకా 8:26–39; మార్కు 5:1–20). ఆ పడవ వద్ద అనేక దయ్యములు (సేన) పట్టిన ఒకడు ఆయన్ను కలిసికొన్నాడు. యేసు వానిని స్వస్థపరచాడు, ఆ దయ్యాలు పందుల గుంపును నాశనం చేశాయి. ఆ పందులు మునిగి నశించిన తరువాత, వాటి యజమానులు ఆ దేశాన్ని విడిచి వెళ్లమని యేసును కోరారు. రెండువేల పందులంటే గొప్ప నష్టమే గదా! ఆ మనిషి స్వస్థ చిత్తుడై బట్ట ధరించుకొని కూర్చుండడం వారికేం నచ్చలేదు.

ప్రభువైన యేసు బోధలు భౌతికమైన దానిని తగ్గించి, ఆత్మ సంబంధమైన వాటిని హెచ్చించాయి. ధనవంతులైయుండగోరడాన్ని వ్యర్థమని యేసు ఎక్కువగా చెప్పాడు. ఆలోచనను రేకెత్తించే ప్రశ్నలను ఆయన అడిగాడు: "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా నేమియియ్యగలడు?" (మత్తయి 16:26). దేహ సంబంధమైన బంధాలకంటే ఆత్మ సంబంధమైనవి బహు బలీయమైనవని, శరీరము కంటే మిన్నయైనదని, కైసరుపైన దేవుడు ఉన్నాడని ఆయన ఉపదేశించాడు. కేవలం రక్తమాంసములే ప్రధానంగా బ్రతుకగోరేవారు ఆయనను అంగీకరించ లేదు! నేడు కూడా అందులో భేదమేమీ లేదు: దేవునికంటే వస్తువులను ఎక్కువగా ప్రేమించేవారు క్రీస్తు బోధలకు అభ్యంతరం చెప్పి, ఆయనను నిరాకరించారు!

## ఆయన వారి పారంపర్యాచారాలను ఖండించాడు

వారి మతసంబంధమైన ఆచారాలను, వారి పారంపర్యాచారాలను యేసు ఖండించాడు. శాస్త్రులు, పరిసయ్యులనే వారు యూదుల తెగల్లో అతి ప్రాధాన్యతగలవారు. వారు దేవుని తమ పెదవులతోనే ఘనపరచుతున్నారని, వారి హృదయాలు ఆయనకు దూరంగా ఉన్నాయని ఆయన వారిపై నేరస్థాపన చేశారు. మనుష్యుల ఆజ్ఞల ప్రకారం సమర్పించే వారి ఆరాధన వ్యర్థమైనదని ఆయన ఉద్ఘాటించారు (మార్కు 7:6, 7). ఆయన వారిని వేషధారులని పిలిచాడు.

యేసుచే యూదులు అభ్యంతరపడినవారైనా, ఆయన బోధించిన ప్రాథమిక సత్యాలకు వ్యతిరేకంగా వారు ఆక్షేపణ తెలుపలేదు. ఆయన బోధించిన సత్యాల్లో అనేకాలు విప్లవాత్మకమైనవై వారు గ్రహించడానికి కష్టంగా ఉండేవి, కాని అది వారి నిజమైన సమస్య కాదు. దోషాలను ఎత్తి చూపడం జనులకు ఆటంకం కలిగించింది, ఎందుకంటే వారు మార్పు చెందడానికి యిష్టం లేకుండా ఉన్నారు. ఆయన మాటలు ఇప్పటివరకు

మండుతున్నాయి. యేసు బోధలో ఉన్న ఒక ఉద్దేశమేమంటే – విపరీతమైన కర్మకాండతో, ఆడంబరం, వైభవోపేతమైన ఉత్సవంతో కూడిన మానవ మతాచారాలను వేర్లుతోకూడ పెల్లగించడమే. వారి మతసంబంధమైన ఆచారాలను ఆయన ఖండించినందున, యేసును అంగీకరించడానికి యిష్టపడలేదు.

లోపాన్ని ఖండించినప్పుడు బాధపడేవారు నేడు కూడా ఉన్నారు. ఒకడు క్రీస్తు యేసుకు కలిగిన మనస్సు కలిగియుండియూ, యితర నూతన మత సిద్ధాంతాల పట్ల లేక ఆచారాల పట్ల విమర్శాత్మకుడై ఉండే అవకాశం ఉందని వారు ఆలోచించారు. ఏదియేమైనా, అతడు క్రీస్తువలె ఉండగోరితే మాత్రం దోషాన్ని ఎక్కడ కనుగొన్నా దాన్ని ఖండించాలి! క్రీస్తుకు కలిగిన మనస్సు కలిగియుండడమంటే, దేనితోనైనా, అసమ్మతిగా ఉండకూడని తియ్యటి స్వభావాన్ని కనుపరచడం అని కొందరు తలంచుతారు, కాని క్రీస్తు మనస్సును గూర్చి వారికి తప్పు అభిప్రాయం ఉంది!

## వారు యిష్టపడలేనంత వినయంగా ఆయన ఉన్నారు

ఆయన దీనస్థితినుండి రావడం, ఆయన సామాన్య జీవితంవలన యూదులు యేసును నిరాకరించారు. ఆయన నజరేతునుండి రావడం వారు ఎదురు చూచిన దానికి పొసగలేదు. బేత్లెహేములోని ఆయన జన్మ రాజరికానికి ఎదురుచూడదగినంతటిదిగా వారికి కన్పించ లేదు. అద్భుతాలు జరిగించుతూ, యేసు తన స్వగ్రామమునకు వచ్చినప్పుడు, "ఇతడు వడ్లవాని కుమారుడు కాడా?" అని జనులు ప్రశ్నించారు (మత్తయి 13:55ఎ). యేసు వారు అంగీకరించలేనంత నిష్కపటంగాను, వినయంగాను ఉన్నాడు!

మనుష్యుల విశ్వాసాన్ని పరీక్షించడానికి, యేసు వారికి అతి చిన్న పనులను ఇచ్చాడు. ఉదాహరణకు యోహాను 9:6, 7లో పుట్టుగుడ్డివాని కన్నులకు బురదపూసి, వెళ్లి దాన్ని కడుగుకొనుమని వానికి ఆజ్ఞాపించాడు. జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెర్రివారిని దేవుడు ఏర్పరచుకొన్నట్టు పౌలు సాక్ష్యమిచ్చాడు (1 కొరింథీ. 1:27, 28).

పాత నిబంధనలోని నయమాను కథలో కూడా ఈ సూత్రానికి బహు శ్రేష్ఠమైన ఉదాహరణ ఉంది (2 రాజులు 5). తన కుష్ఠరోగము శుద్ధియగుటకు ఏమి చేయాలో ప్రవక్త చెప్పినప్పుడు, నయమాను ఎందుకు కోపం తెచ్చుకున్నాడు? చేయమని చెప్పింది బహు సామాన్యమైన కార్యమైయుంది గనుక! అతడు యొర్దాను నదిలో మునగాలి! ఈ రోజుల్లో కూడ, దేవుని యొక్క మార్గం అనేకులకు అతి సామాన్యంగా, అత్యల్పంగా తోస్తుంది – ప్రత్యేకించి వింతైన మతం కావాలనేవారికి, మైమరపించే రాజ్యపరిపాలనా క్రమం కావాలనుకునే వారు. ఇప్పుడు క్రీస్తు భూమిమీద ఉన్నట్టయితే, ఆయనను గూర్చి సిగ్గుపడియుండేవారు! క్రీస్తుతో అనేకులు కలవడానికి, అనేకులు తీసివేయబడడానికి ఇది ఒక ప్రధాన కారణం. ప్రభురాత్రి భోజనంలో ఉన్న సామాన్యత దాన్ని అనేకులు నిరాకరించడానికి ఇది ఒక హేతువైయుంది. అనేకులకు బాప్తిస్మము బుద్ధిహీనతగా కన్పించి క్రీస్తునుండి తొలిగిపోతున్నారు లేక ఆయనను నిరాకరిస్తున్నారు. నీవు దేవునికి ఆనందదాయకంగా ఉండగోరితే, క్రీస్తునందున్న సరళత విషయంలో అసంతృప్తుడవై

యుండకు. "క్రీస్తు ఎడలనున్న సరళతనుండియు పవిత్రతనుండియు ఎట్లయినను తొలిగి పోకుండా"లని పౌలు కొరింథీయులకు హెచ్చరిక చేశాడు (2 కొరింథీ. 11:3).

## ముగింపు

నీవు యేసును, మన కొర్రకైన ఆయన చిత్తాన్ని నిరాకరించావా? నీ ఎదురు చూపులను ఆయన నెరవేర్చలేకపోయాడా? ఆయన మన భౌతిక వాదాన్ని, మానవ మత సాంప్రదాయాలను ఖండించినందున మనకు ఆశాభంగము కలిగిందా? చేయవలసిందిగా ఆయన మనకాజ్ఞాపించిన విషయాల్లోని అతి సామాన్యతను బట్టి ఆయనను నిరాక రించామా? మొదటి శతాబ్దంలోని యూదులవలె మనము ఆయనను నిరాకరింప కూడదు సుమీ.